సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

సోమవారం । 10 । మార్చి । 2025



అట్టహాసంగా కొడవటంచ జాతర

భక్తుల కొంగుబంగారం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.

- 8లో



అప్రెంటిస్‌తో ఉద్యోగం ఈజీ

ఐటీఐ శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులు అప్రెంటిస్ చేస్తే ఏ కంపెనీలోనైనా తేలిగ్గా ఉద్యోగం సంపాదించేందుకు అవకాశం ఉంటుంది.

- 8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం

$36^0/21^0$

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఎండ వేడి, ఉక్కపోత పెరుగుతుంది. రాత్రి పూట చలి తగ్గుతుంది.



న్యూస్‌రీల్..

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

- మహిళా దినోత్సవంలో గంగు ఉపేంద్రశర్మ



హన్మకొండ కల్చరల్: మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోవాలని, ఆత్మస్థైర్యం, పోరాటస్ఫూర్తితో ముందుకు సాగాలని వేయి స్తంభాల దేవాలయం ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పదిరోజులు నిర్వహించాలని కేంద్ర పురావస్తు మంత్రిత్వశాఖ నిర్ణయించిన నేపథ్యంలో.. ఆదివారం హనుమకొండ వేయి స్తంభాల దేవాలయంలో వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా పలు రంగాల్లో నిష్ణాతులైన 16 మంది మహిళలను సన్మానించారు.

ద్వార తోరణాన్ని పరిరక్షించుకోవాలి

- పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి



హన్మకొండ కల్చరల్ : కాకతీయ పాలకుల మొదటి రాజధాని అయిన హనుమకొండ ప్రాంతంలో అగ్గలయ్య గుట్ట సమీపాన ఉన్న 800 ఏళ్లనాటి కాకతీయ ఆలయ ద్వార తోరణాన్ని ప్రభుత్వం పరిరక్షించాలని ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి కోరారు. వరంగల్ నగరానికి చెందిన చరిత్ర పరిశోధకుడు అరవింద్ ఆర్యతో కలిసి శివనాగిరెడ్డి ఆదివారం హనుమకొండలో పర్యటించారు. అగ్గలయ్య గుట్ట సమీపాన ఉన్న ప్రవేశ ద్వారం రోడ్డు నిర్మాణంలో భాగంగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ స్థపతి బి.సుధాకర్‌సింగ్, స్థానికుడు శంభుదయాళ్ ఠాకూర్ పాల్గొన్నారు.

ఇక్కడ పనిచేయడం సంతృప్తినిచ్చింది..

- సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో పనిచేయడం ఎంతో సంతృప్తినిచ్చిందని సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు బదిలీపై వెళ్తున్న సీపీతోపాటు సీఐడీ ఎస్పీగా బదిలీ అయిన ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్‌ను కమిషనరేట్‌లో ఆదివారం పోలీస్ అధికారులు సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈసందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాతో తనకు ఆరు సంవత్సరాల అనుబంధం ఉందని, ఓఎస్డీగా, ఎస్పీగా, అలాగే సీపీ కూడా పనిచేయడం చాలా సంతోషాన్ని కలిగించిందన్నారు. అనంతరం అంబర్ కిషోర్ ఝాను పూలతో అలంకరించిన పోలీస్ వాహనంలో ఊరేగించి గౌరవంగా వీడ్కోలు తెలిపారు. కార్యక్రమంలో డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, అంకిత్‌కుమార్, ఏఎస్పీ చైతన్య, అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటినుంచి ఇంటర్ మూల్యాంకనం

- క్యాంపు అధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ వెల్లడి



కాశిబుగ్గ సెంటర్: వరంగల్‌లోని లాల్‌బహదూర్ కళాశాల(ఎల్‌బీ)లో సోమవారం నుంచి ఇంటర్ మూల్యాంకనం ప్రారంభమవుతుందని వరంగల్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, మూల్యాంకనం క్యాంపు అధికారి డాక్టర్ శ్రీధర్‌సుమన్ తెలిపారు. ఇంటర్ బోర్డు అధికారుల ఆదేశాల మేరకు సంస్కృతం సబ్జెక్టుతో మూల్యాంకనం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ సంవత్సరం నుంచి ప్రారంభవుతున్న స్పాట్ వాల్యుయేషన్ సెంటర్‌లో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈకేంద్రంలో వరంగల్‌తోపాటు మహబూబాబాద్, ములుగు జిల్లాల మూల్యాంకన సిబ్బంది పాల్గొంటారని వివరించారు.

మొరం మాఫియా

యథేచ్ఛగా తవ్వకాలు

- అనుమతి ఒకచోట, తవ్వకాలు మరోచోట
- కాల్వగట్లు, గుట్టలనూ వదలని అక్రమార్కులు
- 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు

సాక్షిప్రతినిధి, వరంగల్ :

అధికారులు, రాజకీయ నాయకుల అండదండలతో అనుమతుల పేరిట సహజ వనరుల్ని అడ్డంగా దోచుకుంటున్నారు అక్రమార్కులు. అర్ధరాత్రి సమయంలో భారీ యంత్రాలతో గుట్టలు, ప్రభుత్వ భూముల్లో మొరం(గ్రావెల్) తవ్వేస్తూ కాసులవేట సాగిస్తున్నారు. గ్రేటర్ వరంగల్ చుట్టూ ఉన్న దామెర, హసన్‌పర్తి, గీసుకొండ, శాయంపేట, ధర్మసాగర్ తదితర మండలాల్లో గ్రావెల్ మాఫియాకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. కొందరు మొరం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి టెంపరరీ పర్మిట్ల(టీపీ)తో పట్టా భూములు, గుట్టలు, ప్రభుత్వ భూముల నుంచి మొరం తవ్వేస్తున్నారు. చాలాచోట్ల శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాకతీయ కాల్వ గట్లను తవ్వుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి.

దోపిడీ సాగుతోందిలా..

గ్రావెల్ మాఫియా టీఎస్ఎంఎంసీ రూల్స్ 1966-9(4) ప్రకారం పట్టాభూములు, రైతుల పేరిట రెండు నెలల గడువుతో తాత్కాలిక అనుమతులు పొందుతూ ఇష్టారాజ్యంగా మొరం దందా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతి



హనుమకొండ జిల్లా దామెర మండలంలో యంత్రాలతో యథేచ్ఛగా మొరం తవ్వకాలు, తరలింపు

పొందిన భూమిలో ఏరియాను బట్టి 8–12 అడుగుల్లోపు లోతు మాత్రమే తవ్వాల్సి ఉంది. అలా చేస్తే రెండున్నర హెక్టార్లలో సుమారు 7–8 వేల మెట్రిక్ టన్నుల గ్రావెల్ మాత్రమే వస్తుందని మైనింగ్‌శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే గ్రావెల్ మాఫియా అందుకు భిన్నంగా 15–30 అడుగుల లోతు వరకు తవ్వి లారీలు, టిప్పర్ల ద్వారా పెద్ద మొత్తంలో మొరం తరలిస్తున్నారు. ఇందుకు సుమారు రెండున్నర హెక్టార్ల కోసం రూ.1.50 లక్షల వరకు రాయల్టీ చెల్లిస్తూ.. రూ.కోట్లల్లో సంపాదిస్తున్నారు. కళ్లెదుటే ఈ అక్రమం జరుగుతున్నా.. ఏ శాఖ కూడా ఆపే ప్రయత్నం చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



పరకాల డివిజన్ పరిధి గుట్టల్లో మట్టి తవ్వకాలు

కంచికి చేరిన కోమటిపల్లి గుట్ట దందా..

హసన్‌పర్తి మండలం భీమారం శివారు 340 సర్వే నంబర్‌లో సుమారు 57 ఎకరాల్లో గుట్ట విస్తరించి ఉంది. అయితే ఇక్కడ అందుబాటులో ఉన్న భూమిని గతంలో కొంత గిరిజన గురుకుల కళాశాల, హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల, ఇంటర్నేషనల్ స్టేడియం ఏర్పాటుకు కేటాయించాలని ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇందులో గిరిజన కళాశాలతో పాటు హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీకి ఐదెకరాల చొప్పున స్థలం కూడా కేటాయించారు. ఇదిలా ఉండగా.. ఓవైపు కళాశాలలకు కేటాయించిన సర్కార్ మరోవైపు 340/1 సర్వే నంబర్ పేరిట రెండున్నర హెక్టార్ల(3.260) భూమి ని కె.నవీన్‌రావు పేరిట క్వారీకి అనుమతి ఇచ్చింది. 2017 జూలై 25 నుంచి 5 సంవత్సరాల పాటు నిబంధనల ప్రకారం క్వారీ నిర్వహించేలా 4097/ క్యూఎల్అండ్1/ డబ్ల్యూజీఎల్/2017 ద్వారా ఈ అనుమతులు ఇచ్చారు. క్యూబిక్ మీటర్‌కు రూ.30 ల చొప్పున 29,90,900 క్యూబిక్ మీటర్లకు అగ్రిమెంట్ కుదుర్చుకుని గుట్టంతా ఖాళీ చేసినా ఎవరూ పట్టించుకోలేదు. రూ.లక్షల ప్రజాధనం పక్కదారి పట్టినా.. ఈ దందాలో తెరవెనుక ఓ ప్రజాప్రతినిధి కూడా స్లీపింగ్ పార్ట్‌నర్‌గా ఉండడం వల్ల అప్పట్లో పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి.

అంతా అనధికారమే!

కొంత అనుమతి తీసుకుని గుట్టలను కరిగించడమే కాదు.. అసలు అనుమతులు లేకుండానే తవ్వకాలు చేపట్టడం ఉమ్మడి వరంగల్‌లో పరిపాటిగా మారింది. వరంగల్, జనగామ, మహబూబాబాద్, జేఎస్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో మొరం, మట్టి దందా జోరుగా సాగుతోంది. ఈ అక్రమ తవ్వకాల గురించి సమాచారం తెలిసినా అధికారులు 'మామూలు'గా తీసుకుంటున్నారు.

- మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ మండలం జంగిలిగొండలోని ప్రభుత్వ భూమిలో గతంలో తవ్వకాలు జరుగుతుండగా అధికారులు అడ్డుకుని హద్దులు ఏర్పాటు చేసినా ఆగడం లేదు.
- ములుగు జిల్లా ములుగు పంచాయతీ శివారు 837 సర్వే నంబర్‌లోని సుమారు 200 ఎకరాల భూమిని గిరిజన విశ్వవిద్యాలయానికి కేటాయించగా.. అక్రమార్కులు మట్టి తవ్వకాలు ఆపడం లేదు.
- వరంగల్ నగరానికి సమీపాన ఉన్న ప్రాంతాల్లో వందలాది ట్రాక్టర్ల ద్వారా మొరం తరలిస్తున్నారు. ఇక్కడ ఒక్కో ట్రాక్టర్‌కు రూ.1500 నుంచి రూ.2500 చొప్పున సుమారు 500 ట్రిప్పుల మొరానికి రూ.7.50 లక్షల నుంచి రూ.12.50 లక్షలు ఆర్జిస్తున్నారు.
- జనగామ జిల్లా జనగామ మండలం వడ్లకొండ ఎన్నె చెరువు పక్కన 5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గుట్టను రాత్రి పూట పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా తవ్వి మట్టిని తరలించారు. చంపక్‌హిల్స్ గుట్టల్లోనూ మట్టిని తోడేస్తున్నారన్న ఫిర్యాదులున్నాయి.
- వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని కోనాయమాకుల, వంచనగిరి ప్రాంతంలోని ఎస్సారెస్పీ కాల్వ పక్కన, కాల్వల నిర్మాణ సమయంలో అధికారులు వాటికి ఇరువైపులా బ్యాంకింగ్ పేరుతో పోసిన కట్టల మొరాన్ని తరలించి సొమ్ము చేసుకున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

మొరం తరలింపులో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం. అక్రమంగా మొరం తరలిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. ఎవరైనా అనుమతులు తీసుకుని మాత్రమే మొరం తవ్వకాలు చేపట్టాలి.

- జ్యోతి వరలక్ష్మీదేవి, తహసీల్దార్, దామెర

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు నిధులు

- ఏడు నియోజకవర్గాలకు రూ.1400 కోట్లు
- నిర్మాణాలకు పరిపాలన అనుమతుల మంజూరు



సాక్షి, వరంగల్: కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు, అత్యాధునిక సాంకేతికతతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించనున్న యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్‌స్కూళ్ల నిధులతో పాటు పరిపాలనా అనుమతులను ప్రభుత్వం జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాలు ఉండగా.. వరంగల్ తూర్పు, నర్సంపేట, పరకాల, భూపాలపల్లి, ములుగు, డోర్నకల్, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాలకు ఒక్కో స్కూల్ చొప్పున మంజూరైన విషయం తెలిసిందే. స్కూల్‌కు రూ. 200 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా ఉత్తర్వులు ఇచ్చారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల కృషితోనే రెండో విడతలో ఈ స్కూళ్ల నిర్మాణానికి అవకాశం దక్కింది.

రంగస్థల కళాకారుల నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

హన్మకొండ కల్చరల్: రంగస్థల కళాకారుల ఐక్యవేదిక వరంగల్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం పోతనవిజ్ఞాన పీఠం ఆడిటోరియంలో పొగాకు రాజేశ్వరరావు అధ్యక్షతన ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాజీపేట తిరుమలయ్య, ఉపాధ్యక్షులుగా వేముల ప్రభాకర్, ఆకుతోట లక్ష్మణ్, ఎస్ఎస్ఆర్. మూర్తి, బిటవరం శ్రీధర్‌స్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జీఎస్.శర్మ, సంయుక్త కార్యదర్శులుగా కుసుమ సుధాకర్, కుడికాల జనార్దన్, కోశాధికారిగా సాధుల సురేశ్, కార్యవర్గ సభ్యులుగా మాలి విజయరాజ్, జూలూరి నాగరాజుగౌడ్, సీత వెంకటేశ్వర్లు, జక్కోజు సత్యనారాయణ, వెంపటి శ్రావణి, సోల్జర్ శశి, ముఖ్య గౌరవ సలహాదారులుగా శ్రీరామోజు సుందర రామ్మూర్తి, నాగపురి సంజయ్‌బాబుగౌడ్, మట్టెవాడ అజయ్‌కుమార్, గడ్డం యుగంధర్‌గౌడ్, పొగాకు రాజేశ్వరరావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కళాకారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం

- కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి



సెమినార్ హాల్‌ను ప్రారంభిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్: పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయమని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. 67 మంది పూర్వ విద్యార్థులు విరాళంగా అందించిన సుమారు రూ.6 లక్షల వ్యయంతో పొలిటికల్ సైన్స్ విభాగంలోని ఓ గదిని అలుమ్నీ సెమినార్ హాల్‌గా అన్ని హంగులతో తీర్చిదిద్దారు. ఆ హాల్‌ను వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం కలిసి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వీసీ మాట్లాడుతూ కేయూ ఆవిర్భవించి 50 సంవత్సరాలు కావొస్తున్నా ఇంకా అనుకున్న స్థాయిలో అభివృద్ధి జరగలేదని అన్నారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మనోహర్, ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ సురేశ్‌లాల్, పూర్వ విద్యార్థులు ఏసీపీ జితేందర్‌రెడ్డి, డాక్టర్ సారంగపాణి, రిటైర్డ్ ప్రొఫెసర్లు వీరన్న నాయక్, రఘురాంరెడ్డి, హరిప్రసాద్, పొలిటికల్ సైన్స్ విభాగం బీఓఎస్ గడ్డం కృష్ణ, వడ్లకొండ సత్యనారాయణ, నాగరాజు, ఇండ్ల నాగేశ్వర్‌రావు, కేయూ పాలకమండలి సభ్యుడు చిర్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శాంపిల్ స్టడీ



హనుమకొండ ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాలలో శిక్షణకు హాజరైన డైట్ విద్యార్థులు(ఫైల్)

- జిల్లాలో 50 పాఠశాలల ఎంపిక
- ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా డైట్ విద్యార్థులు

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లోని రెండో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల్ని అంచనా వేసేందుకు తెలంగాణ పాఠశాల విద్యా శాఖ అండ్ ఎస్‌సీఈఆర్‌టీ (రాష్ట్ర విద్యా శిక్షణ, పరిశోధన మండలి) సంయుక్తంగా ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్)పై శాంపిల్ స్టడీని నిర్వహించనుంది. ఇందులో భాగంగా హనుమకొండ జిల్లాలో 50 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలను ఎంపిక చేశారు. కాగా.. ఈ శాంపిల్ సర్వే కోసం జిల్లాలోని ప్రభుత్వ డైట్ కళాశాల విద్యార్థులు 55 మందికి శిక్షణ ఇచ్చారు. రెండో తరగతి విద్యార్థుల్లో తెలుగు, ఉర్దూ, గణితం, ఆంగ్లం సబ్జెక్టుల్లో వారి సామర్థ్యాలను అంచనా వేసేందుకు ఈస్టడీ ఉపయోగపడనుంది. ఈనెల 10, 11, 12 తేదీల్లో స్టడీ జరగనుంది.

పకడ్బందీగా నిర్వహిస్తాం..



ఎఫ్ఎల్ఎన్ శాంపిల్ స్టడీని పకడ్బందీగా నిర్వహిస్తాం. ఇప్పటికే మండల విద్యా శాఖ అధికారులకు, కాంప్లెక్స్ టీచర్లకు, పాఠశాలల హెచ్ఎంలకు సూచనలిచ్చాం. విద్యార్థులు పాఠశాలలకు హాజరయ్యేలా హెచ్ఎంలు చూడాలి.

- డి.వాసంతి, డీఈఓ, హనుమకొండ

భూపాలపల్లి డీఏఓ ఎవరు?

- నియామక ఉత్తర్వులతో విధుల్లో చేరిన వీరునాయక్
- ఇంకా రిలీవ్ కాని విజయభాస్కర్
- అయోమయంలో వ్యవసాయశాఖ ఉద్యోగులు

సాక్షిప్రతినిధి, వరంగల్: పశుసంవర్ధకశాఖలో పదోన్నతులు, బదిలీల వివాదం మరువక ముందే.. వ్యవసాయశాఖలోనూ కొత్తగా బదిలీల వివాదం వెలుగుచూసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జ్ వ్యవసాయశాఖాధికారి(డీఈఓ) విజయభాస్కర్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డిప్యూటీ డైరెక్టర్ సునావత్ వీరునాయక్‌ను నియమిస్తూ ఆ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఫిబ్రవరి 20న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామక ఉత్తర్వులు ఆలస్యంగా అందుకున్న వీరునాయక్ భూపాలపల్లి డీఏఓగా ఈనెల 6న బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. విధుల్లో చేరి టూర్‌కు వెళ్లి శుక్రవారం కార్యాలయానికి చేరుకున్న వీరునాయక్‌కు తన సీటులో విజయభాస్కరే దర్శనమిచ్చారు. చేసేది లేక ఆయన మరో సీట్లో సర్దుబాటు చేసుకున్నారు. అయితే రిలీవ్ అయ్యే వరకు విధుల్లోనే కొనసాగాలన్న జిల్లా ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాల మేరకే కార్యాలయంలో ఉన్నట్లు విజయభాస్కర్ చెప్పినట్లు సమాచారం. కాగా ఆఫీసులో ఇద్దరు అధికారులు ఉండడంతో ఇంతకీ డీఏఓ విజయభాస్కరా? వీరునాయకా? అన్న అయోమయంలో ఉద్యోగులు ఉన్నారు. రెండు రోజుల సెలవుల తర్వాత తిరిగి సోమవారం కార్యాలయాలు తెరుచుకోనుండగా.. ఈ వివాదానికి ఈ రోజైనా తెరపడుతుందా? అన్న చర్చ జరుగుతోంది.

పదోన్నతి ఇంకెప్పుడు?

ఉద్యోగ విరమణకు దగ్గరలో ఏఈలు

- ప్రమోషన్ కోసం ఎదురుచూపులు
- ఎన్పీడీసీఎల్ యాజమాన్యం జాప్యం



హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం

హన్మకొండ: క్షేత్రస్థాయిలో పని చేస్తున్న తమపై టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం చిన్న చూపు చూస్తోందని విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీర్లు (ఏఈలు) ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో సూపరింటెండెంట్ ఇంజినీర్లకు చీఫ్ ఇంజినీర్లుగా, కొందరు డీఈలకు సూపరింటెండెంట్ ఇంజినీర్లుగా పదోన్నతి కల్పించిన ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ఏఈలకు అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లుగా (ఏడీఈ)లుగా పదోన్నతి కల్పించకపోవడంపై అంతర్యమేంటో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏఈలపై యాజమాన్యం సవతి తల్లి ప్రేమ చూపుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవలి ప్రమోషన్ల అనంతరం తమకు కూడా పదోన్నతి లభిస్తుందని ఆశించిన ఏఈలకు అడియాసలే మిగిలాయి. ఏఈలతో పాటు అర్హులైన ఏడీలు కూడా పదోన్నతిపై ఆశలు పెట్టుకున్నారు. అయినప్పటికీ యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన కనిపించకపోవడంతో నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతున్నారు. కాగా.. టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో 65 ఏడీ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో టీజీ ఎన్పీడీసీఎల్ పరిధి 17 జిల్లాలకు చెందిన సీనియర్ ఏఈలు తమకు పదోన్నతి ఎప్పుడు లభిస్తుందోనని వేచి చూస్తున్నారు. పదోన్నతికి అర్హులైన చాలా మంది ఏఈలు రెండు మూడు నెలల్లో రిటైర్డ్ అయ్యేందుకు సిద్ధంగా ఉన్నారు.

తీవ్ర నష్టం..

గతంలో ఎన్పీడీసీఎల్‌లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్(ఏడీ)లకు డివిజనల్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పించడంలో ఇలాగే జాప్యం జరగడంతో డీఈలుగా రిటైర్డ్ కావాల్సిన అధికారులు యాజమాన్య నిర్లక్ష్య వైఖరితో ఏడీలుగా ఉద్యోగ విరమణ పొందారు. దీంతో పదోన్నతి జాబితాలో ఉన్న ఏడీలు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పుడు ఏఈలకు కూడా ఇదే పరిస్థితి ఎదురుకానుంది. ఏడీలుగా రిటైర్డ్ కావాల్సిన వారు ఏఈలుగా రిటైర్డ్ అవుతున్నారు. కొన్ని ఇంజనీర్ల అసోసియేషన్ నాయకుల వెళ్లి పదోన్నతిపై యాజమాన్యం వద్ద ప్రస్తావిస్తే త్వరలోనే ఇస్తామని చెబుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. దీంతో ప్రతీ రోజు ఏఈలకు రేపో ఎల్లుండో ఉత్తర్వులు వెలువడతాయనే ఆశల్లో విహరిస్తున్నారు. ఇక్కడ ఏఈలకు పదోన్నతి కల్పిస్తే సబ్ ఇంజనీర్ల పదోన్నతికి లైన్ క్లియర్ అవుతుందని ఇంజనీర్ల వర్గాలు చెబుతున్నాయి. ఒక విభాగంలో పదోన్నతి ఆలస్యం చేయడం ద్వారా ఇటు ఏఈలు, అటు సబ్ ఇంజనీర్లు నష్టపోతున్నారు. ఇప్పటికైనా ఎన్పీడీసీఎల్ యాజమాన్యం స్పందించి తమకు పదోన్నతి కల్పించాలని ఏఈలు కోరుతున్నారు. మరో వైపు అర్హులైన ఏడీలు కూడా తమకు పదోన్నతి కల్పించాలని కోరుతున్నారు.

సాగు, తాగునీటికి ఇబ్బంది రావొద్దు

- వరంగల్ ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

వరంగల్: వేసవిని దృష్టిలో పెట్టుకుని ఉమ్మడి వరంగల్ జిల్లాలో సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని తన నివాసంలో మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, కలెక్టర్లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో వేగం పెంచాలని మంత్రి కలెక్టర్లను ఆదేశించారు. వరంగల్ జిల్లాలోని ఎయిర్‌పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగురోడ్డుకు భూసేకరణను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. సమావేశంలో ఎంపీలు బలరాంనాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, కడియం శ్రీహరి, మురళి నాయక్, రాంచంద్రనాయక్, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

పన్ను వసూలు లక్ష్యం చేరుకోవాలి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



పన్ను చెల్లించిన వారికి రశీదు ఇస్తున్న కమిషనర్

వరంగల్: పన్ను వసూలులో నిర్దేశిత లక్ష్యం చేరుకోవాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సిబ్బంది, ఉద్యోగులను ఆదేశించారు. ఆమె ఆదివారం హనుమకొండ పరిధి ఎస్‌బీహెచ్‌కాలనీ, 64వ డివిజన్ పరిధి టీఎన్‌జీఓస్ కాలనీలో పన్ను వసూళ్ల తీరును క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. పన్ను చెల్లించని కమర్షియల్ రెసిడెన్షియల్ నిర్మాణాలకు నోటీసులు అందజేయాలని చెప్పారు. సుదీర్ఘంగా పన్నులు చెల్లించని భవనాలకు ఇప్పటికే రెడ్ నోటీసులు అందజేసినందున వారు స్పందించకుంటే ఆ ఆస్తులను సీజ్ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పన్ను చెల్లించిన యాజమాన్యాలకు కమిషనర్ రశీదులు అందజేశారు. అనంతరం 63వ డివిజన్ వెజిటబుల్ మార్కెట్ ప్రాంతంలో ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్ల తీరును పరిశీలించిన ఆమె సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయించిన దుకాణాలకు విధించిన పెనాల్టీని వసూలు చేయాలని చెప్పారు. ప్లాస్టిక్‌ను నియంత్రించే క్రమంలో సింగిల్ యూజ్‌ను అరికట్టాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంలను సూచించారు. సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్ రవీందర్ పాల్గొన్నారు.

రేపు కొండపర్తికి గవర్నర్ రాక

ఎస్ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని కొండపర్తికి రేపు(మంగళ వారం) రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రానున్నట్లు అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గవర్నర్ కొండపర్తి గిరిజన గ్రామాన్ని దత్తత తీసుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికే గ్రామంలో పలు రకాల అభివృద్ధి పనులను చేపట్టారు. ఈ నేపథ్యంలో అభివృద్ధి పనులను పరిశీలించేందుకు గవర్నర్ కొండపర్తి రానున్నట్లు వెల్లడించారు.

వరంగల్ మీదుగా హోలీకి ప్రత్యేక రైళ్లు

కాజీపేట రూరల్ : హోలీ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వరంగల్ రైల్వే స్టేషన్ మీదుగా ప్రత్యేక రైళ్లు నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు ఆదివారం తెలిపారు. ఈ నెల 10వ తేదీన నిజాముద్దీన్ నుంచి బయలుదేరే నిజాముద్దీన్–తిరువనంతపురం నార్త్ (06074) ఎక్స్‌ప్రెస్ మరుసటి రోజు వరంగల్‌కు చేరుతుంది. ఈ నెల 14వ తేదీన తిరువనంతపురం నార్త్ నుంచి బయలుదేరే తిరువనంతపురం నార్త్–నిజాముద్దీన్ (06073) ఎక్స్‌ప్రెస్ వరంగల్‌కు మరుసటి రోజు చేరుతుంది. ఈ నెల 17వ తేదీన నిజాముద్దీన్–తిరువనంతపురం నార్త్ (06074) ఎక్స్‌ప్రెస్ మరుసటి రోజు వరంగల్‌కు చేరుతుంది. ఈ రైళ్లకు కొల్లం, కాయంకులం, చెంగనూర్, తిరువల్ల, కొట్టాయం, ఎర్నాకులం టౌన్, అలువ, త్రిసూర్, పాలఘడ్, పండనూర్, తిరుప్పూర్, ఈరోడ్, సేలం, జోలర్‌పెట్టయ్, పట్‌పడి, చిత్తూరు, తిరుపతి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, విజయవాడ, వరంగల్, బల్హార్షా, నాగ్‌పూర్, రాణి కమలాపథ్, బినా, ఝాన్సీ, గ్వాలియర్, ఆగ్రా, మతుహుర స్టేషన్లలో హాల్టింగ్ కల్పించినట్లు అధికారులు తెలిపారు.

సాగునీటి కోసం రైతుల ఘర్షణ

- ఎస్సారెస్పీ మెయిన్ కెనాల్‌కు అడ్డుగా రాళ్లు

చిన్నగూడూరు: పంటల సాగుకు ఎస్సారెస్పీ జలాల కోసం మహబూబాబాద్ జిల్లా మరిపెడ, చిన్నగూడూరు మండలాల రైతులు శనివారం రాత్రి ఘర్షణ పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్సారెస్పీ మెయిన్ కెనాల్ నుంచి చిన్నగూడూరు మండలం విస్సంపల్లి పంట పొలాలకు నీరు రాకుండా మరిపెడ మండలం బాల్యతండా, లక్ష్మాతండా రైతులు రాళ్లు అడ్డుపెట్టారు. దీంతో విస్సంపల్లి రైతులు శనివారం రాత్రి కెనాల్ వద్దకు చేరుకుని తమ గ్రామాల్లో పంటలు ఎండిపోతున్నాయని రాళ్లు తీసే ప్రయత్నం చేయగా రెండు ప్రాంతాల రైతులకు మధ్య వాగ్వాదం జరిగింది. మెయిన్ కెనాల్‌ను తాము సుమారు రూ.30 వేలు వెచ్చించి బాగు చేయిస్తే నీళ్లు రాకుండా అడ్డుకుంటున్నారని విస్సంపల్లి, తుమ్మల చెరువుతండాల రైతులు వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

మామిడి కాయలకు కవర్లు..

ఈగ నుంచి పండుకు రక్షణ.. నాణ్యత పెంపు
- చీడలు, తెగుళ్లు, అధిక గాలుల నుంచి రక్షణ
- ఎగుమతులకు అనువైన నాణ్యత.. పురుగు మందుల అవశేషాలు తక్కువ
- సబ్సిడీపై కవర్ల పంపిణీ

చెన్నారావుపేట: మామిడి రైతులు సరైన యాజమాన్య చర్యలు చేపట్టినా పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు, పురుగులు, తెగుళ్ల ఆశించడంతో నాణ్యత తగ్గి దిగుబడులు పడిపోతున్నాయి. కాయ ఎదిగే దశలో పురుగులు, తెగుళ్లతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ చీడపీడల నివారణకు పూత ప్రారంభమైనప్పటి నుంచి కాయకోత వరకు దాదాపు 12 నుంచి 16 సార్లు పురుగు మందు పిచికారీ చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు. దీంతో పెట్టుబడి భారీగా పెరిగి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఎక్కువ సార్లు అధిక గాఢత కలిగిన పురుగుమందులు పిచికారీ చేయడం వల్ల పురుగు మందుల అవశేషాలు పండ్లలో ఉండి వాటిని తిన్న వారికి కేన్సర్ వంటి రోగాలు వస్తున్నాయి. ఈ క్రమంలో పురుగు మందుల వాడకం తగ్గించి.. నాణ్యమైన పంట చేతికి రావడానికి, అధిక ఆదాయం పొందడానికి కాయలు ఎదిగే దశలో కవర్లు తొడగాలని ఉద్యాన శాఖ అధికారులు సూచిస్తున్నారు.

కవర్లు తొడగడం వల్ల లాభాలు..

- కాయ ఎదిగే దశలో కవర్లు తొడగడం వల్ల ఆ దశలో ఆశించే పురుగులు, తెగుళ్ల నుంచి రక్షణ పొందొచ్చు. ముఖ్యంగా పండు.. ఈగ బారిన పడకుండా కాయలను కాపాడొచ్చు. అదే విధంగా అకాల వర్షాలతో వ్యాపించే మసి తెగులు, బ్యాక్టీరియా, మచ్చ తెగులు, పక్షి కన్ను వంటి తెగుళ్లను కూడా ఎలాంటి శిలీంద్రనాశినులు కొట్టకుండా సమర్థవంతంగా అరికట్టొచ్చు.
- కవర్లు తొడిగిన మామిడి కాయలు మంచి రంగు సంతరించుకుని ఎలాంటి మచ్చలు లేకుండా చూడడానికి ఆకర్షణీయంగా కనిపించి కొనుగోలుదారులను ఆకర్షిస్తాయి. కవర్లు తొడిగితే పురుగు మందులు కొట్టాల్సిన అవసరం ఉండదు. రైతుకు ఖర్చు తగ్గుతుంది. పురుగు మందులు కొట్టడం తగ్గడంతో హానికర పురుగు మందుల అవశేషాలు పండులో ఉండవు. దీంతో పండు తిన్న వారికి ఎటువంటి ఆరోగ్య సమస్యలు దరిచేరవు.
- కవర్లు తొడగడం వల్ల పక్షుల నుంచి కలిగే నష్టాన్ని నివారించొచ్చు. కాయపెరిగే దశలో వచ్చే అధిక ఉష్ణోగ్రతలు, వడగాలులు లేదా అకాల వర్షాలతో కలిగే నష్టాన్ని సమర్థవంతంగా అరికట్టొచ్చు. కవర్లు తొడగడం వల్ల కాయలపై సొనతో ఏర్పడే మచ్చలను నివారించొచ్చు. కవర్లు తొడిగిన కాయలు త్వరగా పక్వానికి వస్తాయి. అధిక బరువు పెరగడం వల్ల దిగుబడి కూడా పెరుగుతుంది. కాయలో ఉండే చక్కెర స్థాయిలు పెరుగుతాయి. కోసిన తర్వాత ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. మార్కెట్‌లో అధిక ధర వస్తుంది. రైతుకు ఎక్కువ ఆదాయం లభిస్తుంది.


మామిడి కాయలకు తొడిగిన కవర్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాగు వివరాలు

జిల్లా	రైతులు	ఎకరాలు
వరంగల్	2,053	6,727
హనుమకొండ	2,434	6,075
జనగామ	2,883	8,886
మహబూబాబాద్	2,245	14,052
జయశంకర్ భూపాలపల్లి	906	1,566
ములుగు	153	454
మొత్తం	10,674	37,760

కవర్లు ఎప్పుడు తొడగాలి? ఎలా తొడగాలి?

కవర్లు ఏ దశలో తొడగాలనే అంశం చాలా ముఖ్యం. మరీ లేత దశ అంటే పిందె దశ లేదా గోళీ కాయ సైజులో తొడగొద్దు. అలా తొడిగితే కాయ కాడ లేతగా ఉండడం వల్ల కవర్ బరువు తట్టుకోలేక విరుతుంది. ఒకవేళ మరీ ఆలస్యంగా తొడిగితే అప్పటికే అన్ని రకాల పురుగులు, తెగుళ్ల ఆశించడంతో ఆశించిన మేర నాణ్యమైన పండ్లను పొందలేం. అందుకే కాయ సుమారు 100 గ్రాములు బరువు ఉన్నప్పుడు కవర్లు తొడగాలి. అంటే పూత నుంచి సుమారు 55 నుంచి 60 రోజుల తర్వాత తొడగాలి. కవర్లు తొడిగిన 65–75 రోజులకు కాయ పక్వానికి వస్తుంది. అప్పుడు కవర్లను తొలగించి కాయలను కోసుకోవాలి.

- మామిడి కాయలు అన్ని ఒకే దశలో ఉండవు. కవర్లపై మనం తొడిగిన తేదీలను రాసుకోవడం లేదా నంబర్లు వేసుకుంటే ముందు ఏది తొడిగామో, తొడిగిన తర్వాత ఎన్ని రోజులు అయిందో సులభంగా తెలుసుకోవచ్చు. దాని ప్రకారం కాయలు కోసుకోవాలి. పేపర్‌తో తయారు చేసిన కవర్లు మాత్రమే ఉపయోగించుకోవాలి. పాలిథిన్ కవర్లు వాడకూడదు. పేపర్ కవర్లు చఉపయోగిస్తే లోపల గాలి బయటకు, బయట గాలి లోపలికి వెళ్లే అవకాశం ఉండి కాయ నాణ్యంగా ఉంటుంది.
- కాయకు కవర్ తొడిగేటప్పుడు కవర్ అడుగుకు కాయ తగలకుండా కొంచెం ఖాళీ ఉండేలా చూసుకోవాలి. ఎందుకంటే కాయ పెరుగుతున్నప్పుడు కవర్ పగిలిపోకుండా ఉంటుంది. కవర్లు వర్షం పడుతున్నప్పుడు లేదా మంచు పడే సమయాల్లో తొడగొద్దు. ఎండ ఉన్న రోజు లేదా అలాంటి సమయాల్లో తొడగాలి.
- కవర్లు తొడిగేటప్పుడు పురుగులు, తెగుళ్ల సోకని కాయలను ఎంపిక చేసుకోవాలి. కవర్ తొడిగిన తర్వాత అమర్చిన వైరుతో కాడకు జాగ్రత్తగా ఎలాంటి ఖాళీ లేకుండా తొడగాలి. ఖాళీ ఉంటే పురుగులు, శిలీంద్రాలు ఈ ఖాళీ ద్వారా ప్రవేశిస్తాయి. ఒకవేళ వర్షం పడితే నీరు కూడా కాడ ద్వారా లోపలికి ప్రవేశించి కాయ పాడైపోతుంది.



కవర్లు తొడిగిన పండ్లు, కవర్లు లేకుండా ఉన్న కాయల మధ్య తేడా

కవర్లకు సబ్సిడీ



మొదట వరంగల్ జిల్లాలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మామిడిలో ప్రస్తుతం కవర్లు తొడిగి, నాణ్యమైన కాయలు అందించడానికి ఉద్యానశాఖ కవర్లకు 50 శాతం రాయితీ ఇస్తోంది. హెక్టార్‌కు(2.5 ఎకరాలు) 10, 000 కవర్లు 50 శాతం రాయితీ సదుపాయం ఉంది. ఒక రైతుకు 2 హెక్టార్లు(5 ఎకరాలు) వరకు ఇవ్వడానికి అవకాశం ఉంది. ఆసక్తి, ఇష్టం ఉన్న నర్సంపేట పరిధిలోని దుగ్గొండి, నల్లబెల్లి, నర్సంపేట, ఖానాపురం రైతులు.. ఉద్యాన శాఖ అధికారులు ఎ. జ్యోతి(8977714061), వరంగల్ పరిధిలోని గీసుగొండ, సంగెం, వరంగల్ రైతులు.. ఎస్. తిరుపతి (8977714060), వర్ధన్నపేట పరిధిలోని రాయపర్తి, వర్ధన్నపేట రైతులు..ఎస్ అరుణ(8977714062), నెక్కొండ పరిధిలోని పర్వతగిరి, చెన్నారావుపేట, నెక్కొండ రైతులు.. బి. తరుణ్ (8977714053)ను సంప్రదించి వివరాలు అందించి కవర్లు తీసుకోవాలి.

సంగీత లక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి వరంగల్

ఆదాయ వివరాలు / ఎకరాకు..	కవర్లు తొడిగితే..
ఎకరానికి కవర్లు వాడకుండా 4.0 టన్నుల దిగుబడి వస్తుంది. ధర టన్నుకు రూ. 25,000 ఉంటుంది. ఇలా రూ. లక్ష ఆదాయం వస్తుంది.	ఎకరానికి 4.25 టన్నులు దిగుబడి వస్తుంది. టన్నుకు ధర రూ. 50 వేలు ఉంటుంది. ఇలా రూ. 2,12, 500 ఆదాయం వస్తుంది.

బోరుమన్న మేచరాజుపల్లి..

కళ్లెదుటే భర్త, ఇద్దరు పిల్లల అంత్యక్రియలు జరుగుతుంటే తల్లడిల్లిన తల్లి

- కడసారి చూపుకోసం కదిలొచ్చిన గ్రామస్తులు
- ముగ్గురికి తలకొరివి పెట్టిన మృతుడి తండ్రి సారంగపాణి

నెల్లికుదురు: తన కళ్లెదుటే కుటుంబం మొత్తం నీటిలో పడి మృత్యుఒడికి చేరి అంత్యక్రియలకు వెళ్తుంటే ఆ తల్లి గుండెలవిసేలా రోదించింది. భర్త, ఇద్దరు పిల్లలు చనిపోవడంతో ఇక తనకు దిక్కెవరంటూ దిక్కులు పిక్కటిల్లేలా రోదించింది. తన ముద్దుల చిన్న కొడుకు, మనమడు, మనుమరాలు ఇక లేరని తెలిసి.. వారి మృతదేహాలను శ్మశాన వాటికకు తీసుకెళ్తుంటే వృద్ధ దంపతులు బోరున విలపించారు. తాము ఇక ఎవరి కోసం బతకాలంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. శనివారం వరంగల్ జిల్లా సంగెం మండలం తీగరాజుపల్లిలోని ఎస్సారెస్పీ కాల్వలోకి కారు దూసుకెళ్లిన ఘటనలో మృతి చెందిన సోమారపు ప్రవీణ్ కుమార్, తన పిల్లలు చైత్ర, ఆర్యవర్ధన్ అంత్యక్రియలు ఆదివారం వారి స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లిలో అశ్రునయనాల మధ్య జరిగాయి. 'నాకు తలకొరివి పెట్టాల్సిన కొడుకుకు నేనే తలకొరివి పెట్టాల్సిన దుస్థితిని తీసుకొచ్చావా దేవుడా' అంటూ మృతుడి తండ్రి సారంగపాణి రోదనలు మిన్నంటాయి. అంతిమ యాత్రలో చివరగా ముగ్గురికి కన్నీటి వీడ్కోలు పలికేందుకు గ్రామం మొత్తం కదిలొచ్చింది. ప్రవీణ్‌కుమార్‌తో చదువుకున్న అతడి స్నేహితులు ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి కడసారి చూపుకోసం మేచరాజుపల్లికి తరలిచ్చారు. కేరళ నుంచి యుగేందర్, హైదరాబాద్ నుంచి బెల్లు శ్రీను, నాళ్లం హరికిషన్ ప్రసాద్ తదితరులు వచ్చారు. అంతిమయాత్రలో ముగ్గురిని ఒకేసారి శ్మశాన వాటికకు తీసుకెళ్తుంటే గ్రామం మొత్తం బోరుమంది. తండ్రి, పిల్లల మృతదేహాలకు పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.


ప్రవీణ్‌కుమార్, ఇద్దరు పిల్లల అంతిమ యాత్రలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు

బెయిల్‌పై వచ్చి.. శవమై తేలి

- బావిలో పడి వృద్ధుడి మృతి

డోర్నకల్ : ఎస్సీ, బీసీ కాలనీకి చెందిన ఓ వృద్ధుడు హత్యాయత్నం కేసులో ఇటీవల బెయిల్ వచ్చి.. బావిలో శవమై తేలాడు. ఎస్సై గడ్డం ఉమ తెలిపిన వివరాల ప్రకారం ఎస్సీ, బీసీ కాలనీకి చెందిన కైకొండ సత్యం (69) టైలర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులతో మాట్లాడిన అతను ఆదివారం కాలనీ సమీపంలో బావిలో శవమై కనిపించాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బావి నుంచి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్‌కు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా, డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో సత్యంపై హత్యాయత్నం కేసు నమోదు కాగా రెండు నెలల పాటు జైలులో ఉండి బెయిల్‌పై కొద్దిరోజుల క్రితం విడుదలయ్యాడు.


బావిలో సత్యం మృతదేహం

ప్రాణం తీసిన పల్లిగింజ

- గొంతులో ఇరుక్కుని చిన్నారి మృతి

గూడూరు : పల్లిగింజ తిన్న చిన్నారికి అదే యమపాశమైంది.. గొంతులో గింజ ఇరుక్కుని శ్వాస ఆడక బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం నాయక్‌పల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుండెల వీరన్న–కల్పన దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు అక్షయ్ (18 నెలలు) ఉన్నాడు. గురువారం ఇంటి ఎదుట పల్లీలు ఆరబెట్టగా ఆడుకుంటున్న అక్షయ్ గింజ తిన్నాడు. దీంతో గింజ గొంతులో ఇరుక్కుని శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడ్డాడు. గుర్తించిన తల్లిదండ్రులు వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. చిన్నారి మృతదేహంమీద పడి తల్లిదండ్రులు, కుటుంబీకులు గుండెలవిసేలా రోదించారు. అప్పుడే నీకు నూరేళ్లు నిండిపోయాయ బిడ్డా అంటూ బోరున విలపించారు.


అక్షయ్ (ఫైల్)

14.50 కిలోల గంజాయి పట్టివేత

- ఒడిశా యువకుడి అరెస్ట్

కాజీపేట : కాజీపేటలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ యువకుడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 14.50 కిలోల ఎండు గంజాయి లభ్యమైనట్లు దీని విలువ రూ.3.75లక్షలు ఉంటుందని ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ తెలిపారు. కాజీపేట ఎక్సైజ్ స్టేషన్‌లో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎక్సైజ్ పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఒడిశాకు చెందిన రమేష్ నాయక్ అనుమానాస్పదంగా కనిపించాడు. వెంటనే అతడిని తనిఖీ చేయగా 14.50 కిలోల గంజాయితో పట్టుబడ్డాడు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎస్సై తిరుపతి, ఖలీల్, రవీందర్, పృథ్వీ, లాలయ్య, అయూబ్‌లను సీఐ అభినందించారు.


నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ చంద్రమోహన్

అప్రెంటిస్‌తో ఉద్యోగం ఈజీ..

- నిరుద్యోగ యువతకు అదనపు అర్హత
- అప్రెంటిస్‌తో పెరుగుతున్న ఉపాధి అవకాశాలు

ఐటీఐ వంటి సాంకేతిక విద్యతో యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయి. దీంతో విద్యార్థులు సాంకేతిక విద్యపై ఆసక్తి చూపుతున్నారు. ఐటీఐలోని ఆయా విభాగాలకు అనుగుణంగా విద్యార్థులు పూర్తి చేసే అప్రెంటిస్‌తో ఉద్యోగ అన్వేషణకు తమ మార్గాన్ని మరింత సులభం చేసుకుంటున్నారు. ఈక్రమంలో ఏటా ఐటీఐ పూర్తి చేసిన వారంతా వివిధ కంపెనీల్లో అప్రెంటిస్ శిక్షణ పొందుతూ తమ కలను సాకారం చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

కాజీపేట: ఐటీఐ శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులు అప్రెంటిస్ చేస్తే ఏ కంపెనీలోనైనా ఉద్యోగం తేలిగ్గా సంపాదించేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న 32 ట్రేడుల్లో శిక్షణ పూర్తి చేసుకున్నవారు అప్రెంటిస్‌కు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇందుకోసం www.apprenticeship.gov.in వెబ్‌సైట్‌లో అభ్యర్థి పేరును నమోదు చేసుకుంటే సెల్‌ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. అప్రెంటిస్ ఇచ్చే కంపెనీల పేర్ల జాబితా మెయిల్‌కు వస్తుంది. పదో తరగతి ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, ఐటీఐ ట్రేడ్ ధ్రువీకరణ పత్రం జిరాక్స్ పత్రాలను స్కానింగ్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థి ట్రేడ్‌ను బట్టి అతడు ఏ కంపెనీకి అర్హుడో తేలికగా తెలిసిపోతుంది. కంపెనీలు కూడా అప్రెంటిస్ ఇచ్చేందుకు అదే వెబ్‌సైట్‌లో పేర్లను నమోదు చేసుకుంటాయి. కంపెనీ పేరు, జీఎస్టీ నంబర్, ఈపీఎఫ్ నంబర్, ఫ్యాక్టరీ రిజిస్ట్రేషన్ వంటివి వెబ్‌సైట్‌లో పేర్కొనడం ద్వారా ఆయా కంపెనీలు అప్రెంటిస్ ఇచ్చేందుకు అర్హత పొందుతాయి. ఐటీఐ రెండేళ్ల కోర్సు పూర్తి చేసిన వారికి ఏడాదిపాటు.. ఏడాది ట్రేడ్ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులైతే రెండేళ్ల అప్రెంటిస్ శిక్షణ ఉంటుంది.

3వేల మందికిపైగా పేర్ల నమోదు

ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో చదివి ఉత్తీర్ణులైన సుమారు 3వేల మందికిపైగా అభ్యర్థులు అప్రెంటిస్ కోసం పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో అర్హులకు వివిధ కంపెనీలు తమ అవసరాల మేరకు కాల్ లెటర్లు పంపుతున్నాయి. అప్రెంటిస్ అవ్వగానే చాలా కంపెనీలు ఉద్యోగావకాశాలు సైతం కల్పిస్తున్నాయి.

నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీం

2016 నేప్స్ (నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీం) కింద కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. ఇందులో కొంత మొత్తాన్ని అప్రెంటిస్ చేసే అభ్యర్థులకు రీయింబర్స్‌మెంట్ కింద కంపెనీలకు అందజేస్తాయి. అభ్యర్థికి నెలకు రూ.8,500 స్టయిఫండ్‌గా లభిస్తుంది. దేశంలో అప్రెంటిస్ శిక్షణ నిమిత్తం అన్ని రాష్ట్రాలకు ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం రూ.4వేల కోట్లు కేటాయించింది. 50 లక్షల మంది అభ్యర్థులు శిక్షణ పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోనుంది. ఇదంతా 2026 నాటికి పూర్తవ్వాలని ఆదేశాలు జారీ చేసింది.



అవకాశాలు మెరుగుపడ్డాయి

ఉపాధికి ఐటీఐలు ఎంతగానో దోహదపడతాయి. గతంతో పోల్చితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలతో సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. అప్రెంటిస్ అవకాశాలు దొరుకుతున్నాయి. ప్రతీ మూడు నెలలకోసారి ఐటీఐ కేంద్రాల్లో అప్రెంటిస్ మేళాలు నిర్వహించి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తున్నాం.

- వెంకటేశ్వర్ రావు, ప్రిన్సిపాల్, కాజీపేట ఐటీఐ

ఏయే కంపెనీలు..

ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, బెల్, బీడీఎల్, బీహెచ్‌ఈఎల్, ఈసీఐఎల్, ఆర్టీసీ, జెన్‌కో, సింగరేణితోపాటు అనేక సంస్థలు అప్రెంటిస్ శిక్షణ ఇచ్చే జాబితాలో ఉన్నాయి. ఈ కంపెనీలు జిల్లాలతో సంబంధం లేకుండా జాతీయ స్థాయిలో శిక్షణ ఇస్తున్నాయి. వీటితోపాటు పలు ప్రైవేట్ కంపెనీలు కూడా అప్రెంటిస్ శిక్షణ ఇస్తూ ఉద్యోగ నియామకాలు చేపడుతున్నాయి. అయితే వరంగల్, కరీంనగర్ రీజియన్లలో ఉన్న ఆర్టీసీ డిపోలతోపాటు రైల్వే పలు జోన్లలో ఏడాదికి 25వేల మందికిపైగా అభ్యర్థులు అప్రెంటిస్ నిమిత్తం శిక్షణ పొందుతున్నారు.

నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క


మోడల్ హౌస్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క

గోవిందరావుపేట: నిరుపేదలందరికీ ఇళ్లు నిర్మించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రవేశపెట్టిందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండల కేంద్రంలో రూ.5 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి కలెక్టర్ దివాకర టీఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ములుగు జిల్లాలో మొదటిసారి గోవిందరావుపేట మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. నిరుపేదలు మోడల్ హౌస్‌ను పరిశీలించి తక్కువ ధర, నాణ్యతతో తమ ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. రాబోయే నాలుగు సంవత్సరాల్లో పేదల సొంతింటి కల నెరవేర్చే దిశగా ఇందిరమ్మ ఇళ్ల యాప్ ప్రారంభించుకున్నామన్నారు. ప్రతీ దశలో ఇంటి నిర్మాణ పురోగతి వివరాలు ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, తహసీల్దార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అట్టహాసంగా కొడవటంచ జాతర

- తరలివచ్చిన భక్తులు

రేగొండ: భక్తుల కొంగుబంగారం కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అభిషేకంతో బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. అనంతరం స్వామి వారిని సూర్యవాహన సేవలో మాడ వీధుల గుండా ఊరేగించారు. సాయంత్రం స్వస్తి వాచనం అనంతరం శేషవాహనసేవ, అంకురారోహనం కార్యక్రమాలు కొనసాగాయి. జాతర మొదటి రోజు కావడంతో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, బ్రహ్మోత్సవాలు ఈ నెల 9నుంచి 16వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో ఈఓ మహేశ్, ఆలయ కమిటీ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, సిబ్బంది శ్రావణ్, రవీందర్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.


స్వామి వారిని సూర్యవాహన సేవలో ఊరేగిస్తున్న భక్తులు

భక్తుల కోసం సకల సౌకర్యాలు..

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్, ఆరోగ్య, ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామపంచాయతీ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు.

ఆర్చ్‌ను ఢీకొన్న టిప్పర్

- డ్రైవర్ దుర్మరణం..ఎల్కుర్తిలో ఘటన

ధర్మసాగర్: ఓ టిప్పర్.. వెంచర్ ఆర్చ్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని ఎల్కుర్తి శివారు ఓ వెంచర్ వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన చేపూరి అనిల్ (36) టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఎల్కుర్తి శివారులో హనుమకొండకు చెందిన ఓ వ్యక్తి వెంచర్ చేస్తున్నాడు. వెంచర్ ముందుభాగంలో ఆర్చ్ నిర్మాణం చేశాడు. వెంచర్‌లో టిప్పర్లతో మొరం పోస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం అనిల్ టిప్పర్‌లో మొరం లోడ్ చేసుకుని వెంచర్‌లో అన్‌లోడ్ చేశాడు. అనంతరం డబ్బా దించకుండానే వస్తున్న క్రమంలో ఆర్చ్ పిల్లర్‌ను ఢీకొంది. దీంతో ఆర్చ్ కూలి టిప్పర్ ముందు భాగంలో పడడంతో అనిల్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జానీపాషా తెలిపారు.


టిప్పర్ క్యాబిన్‌లో అనిల్ మృతదేహం

పెళ్లి కాదేమోననే మనస్తాపంతో..

- గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువతి
- చికిత్స పొందుతూ మృతి

ఎల్కతుర్తి: పెళ్లి కాదేమోననే మనస్తాపంతో ఓ యువతి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన ఎల్కతుర్తి మండలం రామకృష్ణాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం..గ్రామానికి చెందిన బొంత రమ్య (22)కు తల్లిదండ్రులు పెళ్లి సంబంధాలు చూసినా కుదరడం లేదు. దీంతో ఇక పెళ్లి కాదేమోననే మనస్తాపంతో ఈనెల 7న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. తల్లి లలిత చూసి వెంటనే 108లో వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి కుమారస్వామి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆదివారం తెలిపారు.